

# సాక్షి నంద్యాల

శుక్రవారం । 17 । మార్చి । 2023

**టీబీ డ్యామ్‌లో 17 టీఎంసీలు**

హొళగుంద: కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్ సామర్థ్యం వంద టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 17 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. అవుట్‌ఫ్లో 9,347 క్యూసెక్కుల కాగా ఇన్‌ఫ్లో జీరోగా నమోదైంది.



**కునుకు రాదేమి !**

ఉమ్మడి కర్నూలు జిల్లా జనాభాలో 30 శాతం మంది నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నట్లు వైద్యులు అంచనా వేస్తున్నారు. కోవిడ్ అనంతరం ఈ సమస్య మరింత జటిలమైనట్లు తెలుస్తోంది. 8లో

**ఉష్ణోగ్రతలు**

| | |
|---|---|
| కనిష్టం | 24.8 |
| గరిష్టం | 35.4 |

## న్యూస్‌రీల్

### ధీరోదాత్తుడు పొట్టి శ్రీరాములు



పొట్టిశ్రీరాములుకు నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

నంద్యాల: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములు ధీరోదాత్తుడు అని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటనరీ హాల్‌లో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి పురస్కరించుకుని గురువారం కలెక్టర్ మనజీర్.. అమరజీవి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్వోపుల్లయ్య, డీఈఓ అనురాధ, పర్యాటక శాఖ అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### హాస్టల్‌ను తనిఖీ చేసిన జడ్జి



సామగ్రిని పరిశీలిస్తున్న జడ్జి రాధారాణి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక దేవనగర్‌లోని నంబర్ వన్ ఎస్సీ బాలుర హాస్టల్‌ను గురువారం సాయంత్రం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, బాత్‌రూంలు, వంట గదులను పరిశీలించి వార్డెన్ అంబటిరెడ్డికి సూచనలు చేశారు. విద్యార్థుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వినతి పత్రం ఇస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఆమె వెంట మండల లీగల్‌సెల్ సిబ్బంది రామచంద్రారెడ్డి, భాస్కర్, తదితరులు ఉన్నారు.

### 19న మహిళా ఆంధ్రా కబడ్డీ జట్టుకు ఎంపిక పోటీలు

నంద్యాల(సిటీ): జాతీయ స్థాయి సీనియర్ మహిళా ఆంధ్రా కబడ్డీ జట్టు క్రీడాకారిణుల ఎంపికకు ఈ నెల 19న పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడా ప్రాధికార ముఖ్య శిక్షకుడు రాజు గురువారం తెలిపారు. గుంటూరు బీఆర్ స్టేడియంలో నిర్వహించే పోటీల్లో ఎంపికైన క్రీడాకారిణులు మార్చి 23 నుంచి 29వ తేదీ వరకు హర్యానాలో జరిగే 69వ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### మల్లన్న హుండీ ఆదాయం రూ. 2.87 కోట్లు



హుండీలెక్కింపులో పాల్గొన్న దేవస్థానం సిబ్బంది

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని ఉభయ దేవాలయాల్లో హుండీ కానుకలను లెక్కించగా నగదు రూపేణా రూ.2,87,01,092 లభించినట్లు శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న తెలిపారు. గురువారం ఆలయంలోని అలంకార మండపంలో 22 రోజుల వ్యవధిలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. నగదుతో పాటు 162 గ్రాముల బంగారం, 7 కేజీల 110 గ్రాముల వెండి వచ్చింది. వీటితో పాటు యూఎస్‌ఏ డాలర్లు 191, కెనడా డాలర్లు 110, ఖతార్ రియల్స్ 4, ఇంగ్లాండ్ పౌండ్స్ 35, మలేషియా రింగిట్స్ 7 మొదలైన విదేశీ నగదు కూడా హుండీల ద్వారా లభించినట్లు తెలిపారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య, సీసీ కెమెరాల నిఘాలో ఈ లెక్కింపు చేపట్టారు.

# సమష్టి విజయం

**స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ కైవసం**

- వైఎస్సార్‌సీపీ బలాన్ని మించి అదనంగా 29 ఓట్లు
- వీరిలో టీడీపీతో పాటు బీజేపీ, వామపక్షాలతో పాటు ఇతరులు
- ఓట్లు చీల్చాలనుకున్న తమ్ముళ్లకు చెంపపెట్టు ఫలితాలు
- ధ్రువీకరణ పత్రాలను అందజేసిన ఆర్‌ఓ రామసుందర్‌రెడ్డి
- కౌంటింగ్ హాలు వద్ద వైఎస్సార్‌సీపీ నేతల కోలాహలం



స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన డాక్టర్ మధుసూదన్, పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి పూలమాల వేస్తున్న పార్టీ నాయకులు

స్థానిక సంస్థల మొత్తం ఓట్లు: **1178** / పోలైన ఓట్లు: **1136** / చెల్లని ఓట్లు: **53**

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్‌కు పోలైన ఓట్లు: **988**

స్వతంత్ర అభ్యర్థి ఎన్.మోహన్‌రెడ్డికి పోలైన ఓట్లు: **85**

స్వతంత్ర అభ్యర్థి భూమా వెంకట వేణుగోపాల్‌రెడ్డికి పోలైన ఓట్లు: **10**

సాక్షి ప్రతినిధి కర్నూలు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుగులేని విజయం సాధించింది. స్పష్టమైన బలం ఉండటంతో పోటీ నామమాత్రం అని భావించినట్లే ఫలితం ఏకపక్షంగా వచ్చింది. ఎన్నికల్లో డాక్టర్ బోయ మధుసూదన్‌కు 988 ఓట్లతో తిరుగులేని గెలుపును సొంతం చేసుకున్నారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామసుందర్‌రెడ్డి ధ్రువీకరణ పత్రం అందజేశారు. మధుతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, కర్నూలు మేయర్ బి.వై.రామయ్య ఉన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్దకు భారీగా చేరుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణుల సంబరం అంబరాన్నంటింది. ఈలలు, కేకలతో బోయ మధుసూదన్‌కు పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. 'జైజగన్.. జిందాబాద్ వైఎస్సార్‌సీపీ' నినాదాలతో సిల్వర్‌జూబ్లీ ప్రాంగణం హోరెత్తింది.

**ప్రశాంతంగా కౌంటింగ్**

కర్నూలులోని సిల్వర్‌జూబ్లీ కళాశాలలో గురువారం ఉదయం ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగింది. రిటర్నింగ్ అధికారి రామసుందర్‌రెడ్డి, ఎన్నికల పరిశీలకుడు ఎంఎం నాయక్ ఆధ్వర్యంలో ఉదయం 8గంటలకే లెక్కింపు ప్రారంభమైంది. రెండు టేబుళ్లలో ఒకే రౌండ్‌గా ఓట్లను లెక్కించారు. 25 ఓట్ల చొప్పున బ్యాలెట్ పత్రాలను విభజించి లెక్కింపు ప్రారంభించారు. 9.30 గంటలకే లెక్కింపు ప్రక్రియ పూర్తయింది. ఆ తర్వాత మరోసారి బ్యాలెట్ పత్రాలు ఇతర అంశాలను పరిశీలించి అధికారికంగా మధు ఎన్నికను ప్రకటించారు. కలెక్టర్ కోటేశ్వరరావు లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భద్రతను పర్యవేక్షించారు.

**వైఎస్సార్‌సీపీలో జోష్**

'స్థానిక సంస్థల' ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితం ఊహించిందే అయినా పోలైన ఓట్లు మాత్రం రాజకీయ పార్టీల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఉన్న బలం కంటే ఎక్కువగా వైఎస్సార్‌సీపీకి పోలవడం, టీడీపీకి ఉన్న ఓట్ల కంటే తక్కువ పోలవడంతో గమనార్హం. వైఎస్సార్‌సీపీకి 1,005 ఓట్లు ఉండగా.. చెల్లని ఓట్లు 46( మధు గుర్తు పక్కలో ప్రాధాన్యత ఓటు 1గా వేయకుండా టిక్ మార్క్ వేశారు). ఈ లెక్కన 959 ఓట్లు పోలవ్వాల్సి ఉండగా.. వైఎస్సార్‌సీపీకి 988 ఓట్లు పోలవడం విశేషం. అంటే 29 ఓట్లు అధికంగా పోలయ్యాయి. ఈ ఓట్లను పరిశీలిస్తే టీడీపీ, బీజేపీ, వామపక్షాలతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీకే మద్దతు పలికినట్లు స్పష్టమవుతోంది.

**టీడీపీకి చెంపపెట్టు!**

టీడీపీకి 134 ఓట్లు ఉండగా.. 19మంది ఓటు హక్కు వినియోగించుకోలేదని తెలుస్తోంది. మిగిలిన 115 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 7 చెల్లని ఓట్లు. తక్కిన 108 ఓట్లలో మోహన్‌రెడ్డికి 85, వెంకట వేణుగోపాల్‌రెడ్డికి 10 కలిపి 95 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. అంటే తక్కిన 13 మంది టీడీపీ ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీకి జైకొట్టడం విశేషం. మధుకు అదనంగా పోలైన 29 ఓట్లలో 13 తీసేస్తే తక్కిన 16 ఓట్లు బీజేపీ, సీపీఐ, సీపీఎం, జనసేనతో ఇతరుల నుంచి పోలైనట్లు స్పష్టమవుతోంది. దీంతో ఈ ఫలితాలు టీడీపీకి చెంపపెట్టుగా మారాయి. నిజానికి ఈ ఎన్నికల్లో ఏమాత్రం బలం లేకపోయినా తమ పార్టీ సర్పంచ్‌లతో స్వతంత్రులుగా బరిలో నిలిపారు. చివరకు తమ పార్టీ ప్రజాప్రతినిధులతో కూడా ఓట్లు వేయించుకోలేకపోయారు. పార్టీలకు అతీతంగా వైఎస్సార్‌సీపీకి ఆకర్షితులవుతున్నారనేందుకు ఈ ఎన్నిక నిదర్శనం.

## జిల్లా పశ్చిమ ప్రాంత అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యేల సహకారంతో సంపూర్ణ విజయం సాధించాం
- సంక్షేమ పాలన చూసి టీడీపీ సభ్యులు కూడా వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారు
- ఎమ్మెల్సీగా గెలిచిన తరువాత మీడియాతో డాక్టర్ ఎ. మధుసూదన్



కర్నూలు(సెంట్రల్): జిల్లాలో పశ్చిమ ప్రాంత అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలిచిన డాక్టర్ మధుసూదన్ పేర్కొన్నారు. గురువారం సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీలో ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను ప్రకటించారు. ఎమ్మెల్సీగా ఘన విజయం సాధించిన ఆయనను కర్నూలు మేయర్ బీవై రామయ్య, ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ శ్వేత, కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి, పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తెర్నేకల్ సురేందర్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. పూలమాలలు వేసి సన్మానం చేశారు. అనంతరం మధుసూదన్ విలేకరులతో మాట్లాడారు. జిల్లా పశ్చిమ ప్రాంతంలో సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు ఎమ్మెల్యేలతో కలసి పనిచేస్తానని చెప్పారు. ఎన్నికల్లో టీడీపీ దొడ్డిదారిన గెలవాలని చూసిందని, అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనను చూసి టీడీపీ సభ్యులే తనకు ఓటు వేశారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, కర్నూలు మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ టీడీపీ అంటేనే దగా, మోసం, కుట్రలు, కుతంత్రాలు అన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నీతి, నిజాయితీలకు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలనను చూసి టీడీపీ సభ్యులే తమ పార్టీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్‌కు ఓటు వేశారన్నారు. ఇది ఇంతటితో ఆగదని ఏ ఎన్నికలు వచ్చినా రిపీట్ అవుతూనే ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు టీడీపీ నేతలకు చెంపపెట్టు అన్నారు.

**సమష్టి మంత్రం సక్సెస్**

కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని 14 నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో పాటు ఇతర కీలక ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేశారని ఈ ఎన్నిక స్పష్టం చేస్తోంది. టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీ ఓటర్లను ప్రలోభపెట్టాలని చూశారు. గెలవలేమని తెలిసినా, వైఎస్సార్‌సీపీకి ఉన్న ఓట్లలో కొన్నింటినైనా తగ్గించగలిగితే ఆ పార్టీకి ఉన్న ఓట్లు కూడా పోలవ్వలేదని, పార్టీ పట్ల కేడర్ నమ్మకంగా లేదని, బలం తగ్గిందని ప్రచారం చేసుకోవచ్చని భావించారు. అయితే వైఎస్సార్‌సీపీ నేతలు సమష్టిగా పనిచేసి ఒక్క ఓటు పక్కకు పోనివ్వకుండా జాగ్రత్త పడ్డారు. ఇదే క్రమంలో ఇతర పార్టీ ఓట్లు కూడా వైఎస్సార్‌సీపీకి పోలవడంతో తమ బలం మరింత పెరిగిందని ఈ ఎన్నిక ద్వారా చెప్పినట్లయింది.

## ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

- ఉమ్మడి జిల్లాలో 1,010 మంది విద్యార్థులు గైర్హాజర్
- మూడు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన ఇద్దరు పరీక్షకు దూరం



నంద్యాలలో పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు

నంద్యాల(సిటీ)/ప్యాపిలి: ఉమ్మడి కర్నూలు జిల్లాలో గురువారం ఇంటర్ మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కర్నూలులో 70 కేంద్రాలు, నంద్యాలలో 53 పరీక్ష కేంద్రాల్లో 32,628 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 31,618 మంది హాజరైనట్లు ఆర్‌ఐఓ గురువయ్యశెట్టి తెలిపారు. కాగా 1,010 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు, ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలకు ఉదయం 8 గంటలకే విద్యార్థులు చేరుకోగా 8.15 గంటల నుంచే లోపలికి అనుమతించారు. 9 గంటలు దాటిన తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించ లేదు. ప్యాపిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రానికి పెద్దపొదిళ్ల గ్రామానికి చెందిన మనోజ్ రామకృష్ణ, వినోద్ మూడు నిమిషాలు ఆలస్యంగా వచ్చారు. నిబంధనల మేరకు ప్రిన్సిపాల్ బాలసుబ్రమణ్యం వారిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించకపోవడంతో తెలుగు పరీక్ష రాయలేకపోయారు.

# సంక్షేమ పరవళ్లు!

**ఉమ్మడి జిల్లాకు దన్నుగా బడ్జెట్**

- ప్రాజెక్టులకు విరివిగా నిధుల కేటాయింపు
- రూ.19కోట్లతో 'గాజులదిన్నె' ఆధునికీకరణ
- నియోజకవర్గానికొక స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం
- 21 రోజుల్లో రేషన్‌కార్డుల మంజూరు
- పురుగుమందుల పిచికారీకి డ్రోన్లు



అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు వెళ్తున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

సాక్షి ప్రతినిధి కర్నూలు: అసెంబ్లీలో గురువారం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి ప్రవేశపెట్టిన బడ్జెట్ వెనుకబడిన ఉమ్మడి కర్నూలు జిల్లాకు వెన్నుదన్నుగా నిలువనుంది. అధిక శాతం ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం కావడం, అందునా వర్షాధార పంటలే కావడంతో సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేసి వ్యవసాయాన్ని పండుగ చేసే చర్యలు చేపట్టడం విశేషం. అందులో భాగంగానే గాజులదిన్నె ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ.19కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్టుపై ఆధారపడి 23వేల ఎకరాల ఆయకట్టు ఉంది. గత ప్రభుత్వాలు పూర్తి నిర్లక్ష్యం చేయగా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.52కోట్లతో ఆధునికీకరణకు టెండర్లు పిలిచింది. ప్రస్తుతం 4.5 టీఎంసీల నుంచి 5.5 టీఎంసీలకు ప్రాజెక్టు సామర్థ్యాన్ని పెంచే పనులు చేస్తున్నారు. ఇందులో భాగంగానే రూ.19కోట్లు కేటాయింపులు చేశారు. పనులు పూర్తయితే సాగునీటితో పాటు డోన్, ఎమ్మిగనూరు, కర్నూలుకు తాగునీటి సమస్య కూడా తీరనుంది.

**వ్యవసాయానికి దన్ను**

బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్దపీట వేశారు. ఆర్బీకేల వద్ద బ్యాంకింగ్ సదుపాయం కల్పించేలా నిర్ణయం తీసుకున్నారు. పురుగు మందులు పిచికారీకి కనీసం ఆర్బీకేకు ఒక డ్రోన్‌కు తక్కువ కాకుండా పంపిణీ చేయనున్నారు. చిరుధాన్యాలసాగును ప్రోత్సహించేందుకు హెక్టార్‌కు రూ.6వేల ప్రోత్సాహం అందించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 5,700 ఎకరాల్లో చిరుధాన్యాలు సాగుచేస్తున్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ఉమ్మడి జిల్లాకు రూ.వందకోట్ల వరకు లబ్ధి చేకూరనుంది.

**21రోజుల్లో రేషన్‌కార్డు**

గతంలో రేషన్‌కార్డులు కావాలంటే ఏళ్ల తరబడి ఎదురుచూసే పరిస్థితి. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత సరళీకృతం చేశారు. ఇప్పుడు ఏకంగా దరఖాస్తు చేసుకున్న 21రోజుల్లోనే కార్డు మంజూరు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో 1,193 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో బీపీఎల్ కింద ఉన్న లబ్ధిదారులందరికీ కార్డులు త్వరగా అందించే అవకాశం ఏర్పడింది.

**ప్రాజెక్టులకు నిధుల వరద**

- కేసీ కెనాల్ ఆయకట్టు స్థిరీకరణకు రాజోలి-జొలదరాశి పనుల కోసం రూ.**225.22** కోట్లు.
- తెలుగుగంగకు రూ.**232.08**కోట్లు
- టీబీ బోర్డుకు రూ.**193.17** కోట్లు
- గాలేరు-నగరికి రూ.**855.35** కోట్లు
- హంద్రీ-నీవాకు రూ.**122.69**కోట్లు
- ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటరీల పరిధిలో మరమ్మతులకు రూ.**80.94**కోట్లు

విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం. నియోజకవర్గానికి ఒకటి చొప్పున, అదనంగా కీలక ప్రాంతాల్లో మరో రెండు సెంటర్లు ఏర్పాటు చేయనుండటం విశేషం.

**నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు**

వైజాగ్‌లో జరిగిన సమ్మిట్‌లో ప్రభుత్వం 378 ఎంఓయూలు చేసుకుంది. తద్వారా 6లక్షల ఉద్యోగాలు రానున్నాయని మంత్రి చెప్పారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన పరిస్థితులు ఉండడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

**నవరత్నాలకు ప్రాధాన్యత**

బడ్జెట్‌లో నవరత్నాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. రైతన్న అండగా నిలిచి వ్యవసాయ రంగానికి ప్రోత్సాహకాలను పెంచారు. ఇప్పటికే రాష్ట్రంలో పేదరిక నిర్మూలన దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ బడ్జెట్‌లోనూ సంక్షేమానికి అధికంగా నిధులు కేటాయించడం శుభపరిణామం.
– బీవై రామయ్య, వైఎస్‌ఆర్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు

**రైతు సంక్షేమానికి పెద్దపీట**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నారు. ఆ విషయం బడ్జెట్ కేటాయింపుల్లో కనిపిస్తోంది. సాగునీటి విషయంలో ప్రత్యేక చొరవ చూపడం వల్ల నిధుల వరద పారింది. ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధుల కేటాయించడం సంతోషకరం.
– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు

బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు మాత్రమే నిధులు కేటాయించారు. అభివృద్ధి పనులను విస్మరించారు.
–డి.గౌస్‌దేశాయ్, సీపీఎం జిల్లా కార్యదర్శి

బడ్జెట్‌లో జిల్లాకు తీరని అన్యాయం జరిగింది. చాలా గ్రామాల్లో తాగునీటి సమస్యలున్నా నిధులు కేటాయించలేదు.
–బి.గిడ్డయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు చెప్పుకోదగ్గ స్థాయిలో నిధులు కేటాయించలేదు. నేతలు ఈ విషయంలో విఫలమయ్యారు
– ఎం.సుధాకర్‌బాబు, డీసీసీ అధ్యక్షుడు

ఈ బడ్జెట్ అంకెల గారడీయే. సంక్షేమ పథకాలకే ప్రాధాన్యత ఇచ్చారు. పెండింగ్ ప్రాజెక్టులను పట్టించుకోలేదు
–సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

ఇది పూర్తిగా సంక్షేమ బడ్జెట్. పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం. పేదరిక నిర్మూలనతో పాటు అభివృద్ధికి ఆస్కారం ఉంది.
–డాక్టర్ మన్సూర్ రెహమాన్, మానవశక్తి పరిశోధన, అభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు

## ఉరుములు మెరుపులతో వర్షం

- చల్లబడిన వాతావరణం

కర్నూలు(అగ్రికల్చర్)/మిడుతూరు/కోవెలకుంట్ల/దొర్నిపాడు: ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలుచోట్ల గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో ఒక మోస్తరు వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమైంది. సాయంత్రం ఉరుములు, మెరుపులతో తేలికపాటి వర్షాలు కురిశాయి. కర్నూలు నగరంలో 27 మి.మీ వర్షం పడటంతో రహదారులు జలమయం అయ్యాయి. కోడుమూరులో 2.75 మి.మీ, గూడూరులో 1.75 మి.మీ. వర్షం కురిసింది. వర్షాలతో వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. శుక్ర, శనివారాల్లో కూడా జిల్లాలోని వివిధ మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.



క్రిష్టిపాడులో మృతి చెందిన కాకులు

**వడగండ్ల వాన:** మండల కేంద్రమైన మిడుతూరుతో పాటు జలకనూరు, ఖాజీపేట, సుంకేసుల, చింతలపల్లి, మాసపేట, 49 బన్నూరు, చెరుకుచెర్ల తదితర గ్రామాల్లో వడగండ్ల వాన కురిసింది. ఆయా గ్రామాల్లో కల్లాల్లో ఆరబెట్టిన పండు మిరప, మొక్కజొన్న తడిసి రైతులకు నష్టం వాటిల్లింది.



కర్నూలులో కురుస్తున్న వర్షం



మిడుతూరులో వడగండ్లు

**నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు**

కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు చోట్ల గురువారం రాత్రి వడగండ్ల వర్షం కురిసింది. స్తంభాలు నేలకొరిగి విద్యుత్ సరఫరాలకు అంతరాయం ఏర్పడింది. దొర్నిపాడు మండలం క్రిష్టిపాడులో వడగండ్ల వానకు కాకులు మృతి చెందాయి.

## పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి

- మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్

నంద్యాల: పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటనరీ హాల్‌లో పది పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, కస్టోడియన్, డిపార్టుమెంట్ అధికారులు, ఎంఈఓలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షల్లో పేపర్ లీకేజీ, మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్ తదితర అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే సంబంధిత అధికారులపై తీవ్ర కఠిన చర్యలు తప్పవన్నారు. పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. గతేడాది చోటు చేసుకున్న సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. 125 పరీక్షా కేంద్రాల్లో 25,411 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాలుగా గుర్తించిన 6 సెంటర్లపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు అదనపు పోలీస్ బలగాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కాంపౌండ్ వాల్ లేని పాఠశాలల్లో బారీకేడ్లు ఏర్పాటు చేసి అనధికారిక వ్యక్తులెవరినీ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, ఫర్నిచర్, తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవడంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ షాపులు మూసి వేయడం జరుగుతుందన్నారు. పరీక్షలకు గైర్హాజరైన విద్యార్థుల ప్రశ్నపత్రాలు జాగ్రత్తగా భద్రపరిచేందుకు చీఫ్ సూపరింటెండెంట్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణపై ఏ ఒక్క చిన్న ఫిర్యాదు వచ్చినా సంబంధిత అధికారులపై సీరియస్ చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, డీఈఓ అనురాధ పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో 24 గొర్రెపిల్లల మృతి

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని కురవల దొడ్డి గ్రామ పొలాల్లో మేతకు వెళ్లిన గొర్రె పిల్లలపై గురువారం మధ్యాహ్నం కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో గ్రామానికి చెందిన రాజుకి చెందిన 11 గొర్రెలు, హనుమంతుకి చెందిన 13 గొర్రె పిల్లలు మృత్యువాతపడ్డాయి. తమకు నష్టపరిహారం ఇప్పించాలని బాధిత రైతులు కోరుతున్నారు.



# కునుకు రాదేమి!

- పెరుగుతున్న నిద్రలేమి సమస్య
- జిల్లాలో 30 శాతానికిపైగా బాధితులు
- జీవన శైలి మార్చుకోవాలంటున్న వైద్యులు
- నేడు వరల్డ్ స్లీప్ డే


కర్నూలు(హాస్పిటల్): ఆకలి రుచెరగదు.. నిద్ర సుఖమెరగదు అన్నారు పెద్దలు. అయితే ప్రస్తుతం కొందరు కంటి నిండా నిద్రకు దూరమవుతున్నారు. తమ సమస్యను పరిష్కరించుకునేందుకు మానసిక వైద్య నిపుణులు, జనరల్ ఫిజీషియన్ల వద్దకు వెళ్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లా జనాభాలో 30 శాతం మంది నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నట్లు వైద్యులు అంచనా వేస్తున్నారు. కోవిడ్ అనంతరం ఈ సమస్య మరింత జటిలం అయ్యిందని వారు పేర్కొంటున్నారు. ప్రతి సంవత్సరం మార్చి మూడో శుక్రవారం వరల్డ్ స్లీప్ డే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.

**ఇవీ కారణాలు..**

నిద్రలేమి సమస్యతో వైద్యుల వద్దకు వస్తున్న వారిలో 70 శాతం ఆందోళన, మానసిక ఒత్తిడితో ఉంటున్నారు. విద్య, ఉద్యోగ, వ్యాపారం, కుటుంబ వ్యవహారాల విషయాల్లో అనవసర భయాందోళనకు లోనయ్యేవారు అధికమయ్యారని వైద్యులు గుర్తించారు. చిన్న చిన్న విషయాలకే తీవ్ర ఆందోళనకు గురవుతూ నిద్రరాని వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. కోవిడ్ అనంతర పరిస్థితుల కారణంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇంటి నుంచే పని చేసేవారు. కొందరు ఇప్పటికీ ఈ విధానంలోనే పనిచేస్తున్నారు. ల్యాప్‌టాప్‌పై ఎక్కువసేపు పనిచేస్తుండడంతో వీరికి నిద్రలేమి సమస్య వస్తోంది. మరికొందరు యువత స్మార్ట్‌ఫోన్‌కు అతుక్కుపోతున్నారు. దాంతో కాలక్షేపం చేస్తూ రాత్రి 2 గంటలకు నిద్రపోవడం లేదు.

**సమస్యలు ఇవీ..**

నిద్ర తగ్గితే మానసిక ఒత్తిడి పెరుగుతుంది. చేసే పనిపై ఏకాగ్రత సన్నగిల్లుతుంది. మొబైల్‌కు బానిసైన పిల్లలు నిద్రలో విచిత్రంగా ప్రవర్తించడం చేస్తుంటారు. నిద్రలేమి సమస్యతో ఇటీవల కర్నూలు, నంద్యాల, ఆదోని వంటి పట్టణాల్లో రాత్రి వేళల్లో రోడ్లపై తిరిగే వారి సంఖ్య అధికమైంది. చాలా మంది రాత్రి 3 గంటలకు ఇళ్లకు చేరుకుని అప్పుడు నిద్రపోతున్నారు. ఇలాంటి వారిలో 20 నుంచి 45 ఏళ్లలోపు వారు అధికంగా ఉంటున్నారు.



**అలవాట్లు మార్చుకోవాలి**

- ప్రతిరోజూ ఒకటే సమయానికి నిద్రపోవడం, నిద్ర లేవడం ఆరోగ్యానికి మంచిది.
- రాత్రిపూట తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి.
- కాఫీ, టీ ఎక్కువగా తాగడం, ధూమపానం, మద్యపానం అలవాట్లు మానుకోవాలి.
- నిద్ర సమయానికి రెండు గంటల ముందు నుంచి మొబైల్ ఫోన్, కంప్యూటర్, టీవీలకు దూరంగా ఉండాలి.
- రాత్రి నిద్రపోయే ముందు తేలికపాటి నడక, ధ్యానం చేయడం, సంగీతం వినడం మంచిది.

### నరాల సమస్యలతోనే నిద్రలేమి



ఇటీవల కాలంలో నరాల సమస్యతో బాధపడే రోగుల్లో నిద్రలేమి సమస్య ఎక్కువగా చూస్తున్నాం. పనిఒత్తిడి, ఆందోళన, స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లను అతిగా వాడటం, కొన్ని రకాల మందులను వాడటం వల్ల ఈ సమస్య వస్తోంది. రోజూ 6 నుంచి 8 గంటలు నిద్రపోవడం వల్ల శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. నిద్ర బాగుంటే పనితీరు కూడా మెరుగవుతుంది. –డాక్టర్ కె.హేమంత్‌కుమార్, న్యూరోఫిజీషియన్, కర్నూలు

### జీవనశైలి మార్చుకోవాలి



నిద్రలేమి వల్ల ఏకాగ్రత కోల్పోవడం, నిస్సత్తువ, వ్యాధినిరోధక శక్తి తగ్గిపోవడం, కోపం, చిరాకు, అజీర్ణం, గ్యాస్ట్రబుల్ వంటి సమస్యలు వస్తాయి. షుగర్, స్థూలకాయం, గుండెజబ్బులు, స్ట్రోక్ ఉన్న వారిలో నిద్రలేమి ఒక ప్రధాన సమస్యగా ఉంది. ఇలాంటి వారు వైద్యులను కలిసి వారి సమస్యలను వివరించి చికిత్స తీసుకోవాలి. దీంతో పాటు జీవనశైలిలోనూ మార్పులు చేసుకోవాలి. మద్యపానం, ధూమపానం, కాఫీ, టీలకు దూరంగా ఉండాలి.

–డాక్టర్ సరయూరెడ్డి, జనరల్ ఫిజీషియన్, కర్నూలు

## వంద శాతం బిల్లులు వసూలు చేయాలి

- విద్యుత్ ఎస్ఈ ఉమాపతి

కర్నూలు(రాజ్‌విహార్): నెలవారీ విద్యుత్ బిల్లులు వంద శాతం వసూలు చేయాలని దక్షిణ ప్రాంత పంపిణీ సంస్థ కర్నూలు ఎస్ఈ (ఆపరేషన్స్) ఎం.ఉమాపతి అన్నారు. గురువారం స్థానిక పవర్ హౌస్‌లో కర్నూలు ఆపరేషన్స్ డివిజన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సెక్షన్ల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్పాట్ బిల్లింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత బిల్లుల వసూలుపై దృష్టి సారించాలన్నారు. పాత బకాయిలు రాబట్టేందుకు చర్యలు చేయాలన్నారు. ప్రభుత్వ శాఖల బకాయిలపై దృష్టి సారించాలన్నారు. సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్‌ను నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆపరేషన్స్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## నందికొట్కూరు పురపాలక సంఘము

నందికొట్కూరు పట్టణ ప్రజలకు తెలియజేయడము ఏమనగా పురపాలక సంఘమునకు చెందిన మార్కెట్ల వేలము 2023-24 ఆర్థిక సంవత్సరమునకు గాను వారపు సంత, దిన కూరగాయల మార్కెట్, బస్టాండ్ ఫీజులు, జంతు వధశాల మరియు మాంసపు మార్కెట్ సంబంధించి తేది: 25-03-2023 ఉదయం 11.00 గంటలకు మునిసిపల్ కార్యాలయము జైకిసాన్ పార్క్ నందు బహిరంగ వేలం నిర్వహించబడును. ఆసక్తి కలవారు వాల్యూయేషన్ సర్టిఫికెట్‌తో పాటు ధరావత్తును కమీషనర్ నందికొట్కూరు మునిసిపాలిటి పేరు పై డి.డి.రూపములో చెల్లించి బహిరంగ వేలం నందు పాల్గొనవచ్చును.

సం/- పి.కిశోర్, కమీషనర్, నందికొట్కూరు మునిసిపాలిటి

## ఆళ్ళగడ్డ పురపాలక సంఘము

ఆర్.ఓసి. నెం. 78/2017/ఏ1 బహిరంగ వేలము ప్రకటన తేది : 16-03-2023

2023-2024 ఆర్థిక సంవత్సరమునకు గాను ఆళ్ళగడ్డ పురపాలక సంఘము నందు ఈ దిగువ కనబరచిన మార్కెట్లకు సంబంధించి రుసుము వసూలు చేసుకొను హక్కునకు గుత్తకు ఇచ్చుటకు గాను తేది : 23-03-2023వ తేది గురువారము ఉదయము 11:00 గంటలకు పురపాలక సంఘ కార్యాలయము నందు గజెట్ లోని షరతుల మేరకు కమిషనర్ గారిచే లేదా వారి అధికారము పొందిన వారిచే బహిరంగ వేలము వేయబడును.

| నెం. | గుత్త వివరము | వేలము సమయములో ముందుగా చెల్లించవలసిన డిపాజిట్టు | హాజరు పరచవలసిన సాల్వెన్సీ సర్టిఫికేట్ | బ్యాంకు గ్యారంటీ/ పూచి కత్తు | గుత్త కాలము | కేంద్ర ప్రభుత్వ సేవా పన్ను (GST) |
|---|---|---|---|---|---|---|
| 1 | దిన మార్కెట్ | 13,45,000 | 13,45,000 | 13,45,000 | వేలముఖాయపరిచిన తేది నుండి 31-03-2024 వరకు | 18% |
| 2 | వారపు సంత మార్కెట్ | 7,15,000 | 7,15,000 | 7,15,000 | వేలముఖాయపరిచిన తేది నుండి 31-03-2024 వరకు | 18% |
| 3 | వాహనముల మెట్ట/ బస్టాండ్ | 14,23,000 | 14,23,000 | 14,23,000 | వేలముఖాయపరిచిన తేది నుండి 31-03-2024 వరకు | 18% |
| 4 | జంతువధశాల మరియు మాంసపు మార్కెట్ | 4,25,000 | 4,25,000 | 4,25,000 | వేలముఖాయపరిచిన తేది నుండి 31-03-2024 వరకు | 18% |

కావున వేలము నందు పాల్గొనదలచిన వారు వేలమునకు సంబంధించిన షరతులు నిబంధనలు మొదలగు వివరములు పురపాలక సంఘ కార్యాలయ పని వేళల యందు తెలుసుకొనవచ్చును.

గమనిక : పై వేలమునకు సంబంధించి నిభందనలు గజెట్‌ను రూ. 100/- చెల్లించి మునిసిపల్ కార్యాలయము నందు పొందవలెను.

కమిషనర్, ఆళ్ళగడ్డ పురపాలక సంఘము

## నాల్గో అంతస్తు నుంచి పడి కూలీ మృతి

కర్నూలు/గోనెగండ్ల: కర్నూలు శివారులోని గుత్తిరోడ్డులో ఉన్న ఇండస్ స్కూల్ సమీపంలో కొత్తగా నిర్మాణంలో ఉన్న నాలుగంతస్తుల భవనం నుంచి ప్రమాదవశాత్తూ కిందపడి బోయ పరమేష్ (45) మృతి చెందాడు. గోనెగండ్ల మండలం గాజులదిన్నె గ్రామానికి చెందిన పరమేష్ భార్య దుర్గమ్మ, కొడుకు కృష్ణతో కలిసి ఉపాధి నిమిత్తం 15 రోజుల క్రితం కర్నూలుకు వచ్చాడు. ఇండస్ స్కూల్ దగ్గర భవన నిర్మాణం ఒప్పుకున్న మేస్త్రీ ముల్లా మహబూబ్‌బాషా దగ్గర కూలీలుగా చేరి పని చేస్తూ అక్కడే ఉండేవారు. గురువారం ఉదయం భార్య, కుమారుడు కింది అంతస్తులో పని చేస్తుండగా పరమేష్ సిమెంట్ సంచులు ఓపెన్ క్రేన్‌లో లోడ్ వేసుకుని నాల్గవ అంతస్తులో అన్‌లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. తలకు, ఉదర భాగానికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. నాల్గవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

# అనుమానంతోనే అంతమొందించారు!

- వీడిన జంట హత్యల కేసు మిస్టరీ
- ముగ్గురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీఐ శంకరయ్య



జంట హత్యల కేసులో నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కర్నూలు: కల్లూరు మండలం చింతలమునినగర్ (సుబ్బలక్ష్మి నగర్)లో జంట హత్యల కేసు మిస్టరీ వీడింది. అనుమానంతోనే రుక్మిణి, రమాదేవిని అంతమొందించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. దారుణానికి పాల్పడిన నారపురం శ్రావణ్‌కుమార్, నారపురం వరప్రసాద్, నారపురం క్రిష్ణవేణిలను బుధవారం సాయంత్రం గుత్తి పెట్రోల్ బంక్ వద్ద అరెస్ట్ చేసి నేరానికి ఉపయోగించిన రెండు కత్తులు, రక్తం అంటిన దుస్తులను స్వాధీనం చేసుకుని కర్నూలు డీఎస్పీ కేవీ మహేష్ ఎదుట హాజరు పరిచారు. గురువారం మధ్యాహ్నం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శంకరయ్య వివరాలను వెల్లడించారు. తెలంగాణలోని వనపర్తికి చెందిన వెంకటేశ్వర్లు, రమాదేవి దంపతుల కుమార్తె రుక్మిణీదేవికి కల్లూరు మండలం చింతలమునినగర్‌కు చెందిన ప్రసాద్, క్రిష్ణవేణి దంపతుల కుమారుడు శ్రావణ్‌కుమార్‌తో ఈ నెల 1వ తేదీన వివాహం జరిగింది. వివాహం జరిగిన మూడు రోజుల తరువాత శోభనం జరగ్గా, శ్రావణ్‌కుమార్ మూత్ర నాళంలో ఇన్‌ఫెక్షన్ వచ్చింది. దీంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించారు. శ్రావణ్ ఆరోగ్య విషయంలో రెండు కుటుంబాల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి.

**వివాహమైన నాటి నుంచే అనుమానం**

వివాహ నిశ్చితార్థం అయిన అనంతరం రుక్మిణీదేవికి శ్రావణ్‌కుమార్ సెల్ ఫోన్ కొనిచ్చి ప్రతి రోజూ మాట్లాడుతుండే వాడు. కొన్ని సందర్భాల్లో ఎక్కువ సమయం ఫోన్ ఎంగేజ్ వస్తుండడంతో ఓ యాప్‌ను ఆమె సెల్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసి తన మెయిల్ ఐడీకి లింక్ చేసుకున్నారు. గూగుల్ డ్రైవ్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ఆమె మాటలను(వాయిస్ రికార్డు) వినేవాడు. ఇదే సందర్భంలో వనపర్తిలో ఆమెకు బాయ్ ఫ్రెండ్ ఉన్నట్లు వాయిస్ రికార్డులో విని ఇదే విషయాన్ని తండ్రి ప్రసాద్‌కు చెప్పుకొని బాధ పడ్డాడు. దీంతో వేరొకరితో సంబంధం ఉన్న రుక్మిణీదేవిని తన కుమారునికి కట్టబెట్టి అన్యాయం చేయడం కాక, వంశాన్ని నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతో మూత్ర నాళానికి శస్త్ర చికిత్స చేయించి నపుంశకున్ని చేశారనే అపోహతో తండ్రి, కొడుకులు కలిసి హత్య చేసేందుకు కుట్ర పన్నినట్లు పోలీసులు విచారణలో తేల్చారు. శ్రావణ్ వనపర్తి నుంచి భార్య, అత్తమామలను వెంట బెట్టుకొని ఈ నెల 14వ తేదీన కర్నూలుకు వచ్చాడు.

**పక్కా పథకంతోనే జంట హత్యలు..**

వనపర్తి వెంకటేష్ కుటుంబాన్ని అంతమొందించాలని తండ్రి, కొడుకులు ముందుగానే వేసుకున్న పథకం ప్రకారం శ్రావణ్ కుమార్ తండ్రి ప్రసాద్ చెన్నమ్మ సర్కిల్‌లో ఉన్న ఓ మాల్‌లో రెండు కత్తులు కొనుగోలు చేసి ఇంట్లో పెట్టుకున్నాడు. వెంకటేష్ దంపతులను మొదటి అంతస్తులో ఉంచి తండ్రి కొడుకులు కలిసి ముందుగా గదిలో ఉన్న రుక్మిణిని కత్తులతో దాడి చేసి హత్య చేసి, మొదటి అంతస్తులకు వెళ్లి రమాదేవిని కూడా కత్తులతో పొడిచి చంపారు. ఈ దాడిలో ఆమె భర్త వెంకటేష్ తీవ్ర గాయాలకు గురై ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శ్రావణ్‌కుమార్‌తో పాటు తండ్రి వరప్రసాద్, తల్లి క్రిష్ణవేణిలను కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ శంకరయ్య తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ రామయ్య పాల్గొన్నారు.



హత్యకు ఉపయోగించిన కత్తులు

## సమన్వయంతో విధులు నిర్వహించాలి



కల్యాణ కట్ట వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాల్లో దేవస్థానం అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని ఈఓ ఎస్ లవన్న ఆదేశించారు. ఉగాది మహోత్సవాలకు తరలివచ్చే భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఉత్సవ ఏర్పాట్లు పర్యవేక్షణలో భాగంగా గురువారం దేవస్థానం ఈఓ లవన్న సంబంధిత అధికారులతో కలిసి కల్యాణకట్ట డార్మెంటరీలు, శివదీక్షా శిబిరాలు, క్షేత్రపరిధిలో పలు చోట్ల ఏర్పాటు చేసిన శౌచాలయాలు తదితర వాటిని పరిశీలించారు. ఈఓ మాట్లాడుతూ దేవస్థానం అన్ని విభాగాల అధికారులు , సిబ్బంది అప్రమత్తంతో, అంకిత భావంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ, ఏఈఓ ఫణిధరప్రసాద్, ఏఈలు రాజేశ్వరావు, రంగప్రసాద్ తదితరులు ఉన్నారు.

# తల్లీబిడ్డలపై అత్యాచారయత్నం

- దృశ్యం సినిమాను తలపించిన ఘటన
- స్థానికులు దేహశుద్ధి చేయడంతో పరారైన యువకుడు

కర్నూలు(సెంట్రల్): నగరంలోని జొహరాపురం ఇందిరమ్మ కాలనీలో దృశ్యం సినిమాను తలపించే ఘటన చోటు చేసుకుంది. ఓ కామాంధుడు 9 ఏళ్ల చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక తప్పించుకొని తల్లి వద్దకు చేరుకోగా.. ఆ యువకుడు ఆమెపైనా అత్యాచార యత్నానికి పాల్పడబోగా స్థానికులు గుర్తించి దేహశుద్ధి చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న దంపతులకు 9 ఏళ్ల బాలిక, 7ఏళ్ల బాలుడు సంతానం. కూలీ పనుల కోసం యజమాని బయటకు వెళ్లగా.. గురువారం సాయంత్రం 5.30 గంటల సమయంలో పిల్లలు ఇద్దరూ సమీప సచివాలయం వద్ద ఆడుకుంటున్నారు. ఆ సమయంలో జిలేబీ బాషా ఊరఫ్ ఫైరోజ్(25) కన్ను ఆ బాలికపై పడింది. పిల్లాడికి డబ్బులిచ్చి బిస్కెట్లు తీసుకు రమ్మని పంపించాడు. బాలికను సచివాలయం వెనక్కు తీసుకెళ్లి బలాత్కారం చేయబోయాడు. భయపడి పరుగుతీసిన బాలిక ఇంటికి చేరుకొని జరిగిన విషయాన్ని తల్లికి చెప్పింది. ఇంతలో బాలికను వెంబడిస్తూ ఇంట్లోకి దూసుకొచ్చి యువకుడు 'మీ పాప బదులు మీరైనా కోరిక తీర్చాలని' అత్యాచార యత్నం చేయబోయాడు. ఇంతలో ఆమె పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు పోగై దేహశుద్ధి చేయగా కామాంధుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ తిమ్మారెడ్డి తెలిపారు.

## గజ్జహళ్లిలో శతాధిక వృద్ధురాలి మృతి

హొళగుంద: గజ్జహళ్లి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు ముల్లా అల్లాబీ(105) బుధవారం రాత్రి మృతి చెందారు. అల్లాబీది వ్యవసాయ కుటుంబం. ఈమె భర్త ముల్లా దనేసాబ్ చాలా ఏళ్ల క్రితమే మృతి చెందాడు. ఈమెకు ఐదుగురు సంతానం కాగా.. అందరూ మృతి చెందారు. చిన్న కోడలు మాత్రమే బతికి ఉన్నారు. ఈమెకు ఇద్దరు కుమారులుండగా వారికి ఐదుగురు సంతానం. వారికి పెళ్లిళ్లు కూడా అయి పిల్లలు కూడా ఉన్నారు. వీరంతా గ్రామంలో వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటూ జీవనం చేస్తున్నారు. అల్లాబీ పొలం పనులు చేస్తూ, మాంసం, రొట్టెలు, పండ్లు ఎక్కువగా తినేవారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు వృద్ధాప్య కారణంగా మృతి చెందినట్లు చెప్పారు.

# మిర్చి అ'ధర'హో!




కల్లాల్లో ఆరబోసిన మిర్చి

- పెరుగుతున్న మిర్చి ధరలు
- బ్యాడిగ రకం క్వింటం రూ. 53 వేలు
- సాధారణ రకం క్వింటం రూ. 30 వేలు
- ఆనందంలో రైతులు

ఆత్మకూరు: ఎర్ర బంగారం ధరలు పసిడితో పోటీ పడుతున్నాయి. రోజురోజుకు ధరలు పెరుగుతుండటంతో రైతుల్లో ఆనందం నెలకొంది. పంట కోతలు ప్రారంభమైనప్పటి నుంచి మంచి ధర వస్తుండటంతో మిర్చి రైతుకు కాసుల పంట పండుతోంది. గతేడాది దిగుబడి తగ్గి, ధర లేక ఎంతో నష్టపోయిన రైతులు ఈ ఏడాది కొంత కోలుకుంటున్నారు. ఈ ఏడాది నంద్యాల జిల్లాలో 17,019 మంది రైతులు దాదాపు 43,318 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ఎక్కువగా బ్యాడిగతో పాటు 334, 341 హైబ్రిడ్, నెంబర్-5, తేజ, సాలు మిర్చి రకాలు సాగు చేశారు. ప్రస్తుతం మొదటి, రెండు కోతలు పూర్తయ్యాయి. బ్యాడిగ రకం ఎకరాకు సగటున 25 క్వింటాళ్లు, గరిష్టంగా 30 క్వింటాళ్లపైనే వస్తుండటం విశేషం. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి వస్తోంది. అయితే మిర్చికి రికార్డు స్థాయిలో ధర లభిస్తుండటంతో రైతులు సంబరపడుతున్నారు. గుంటూరు మిర్చి యార్డులో బ్యాడిగ రకం గరిష్టంగా క్వింటాలుకు రూ.53 వేలు ధర లభించింది. అలాగే ఇతర రకాలకు క్వింటాల్ మిర్చి ధర రూ. 30 వేల నుంచి రూ. 38 వేలు పలుకుతోంది. గత ఏడాది మిర్చి ధర రూ. 22 వేల నుంచి 28 వేలు పలికింది. ఈ ఏడాది తెగుళ్లతో దిగుబడి తగ్గింది. ఎకరాకు 18 నుంచి 25 ఎకరాల లోపు దిగుబడి వచ్చింది. అయితే ధరలు గత ఏడాది కంటే క్వింటాకు దాదాపు రూ. 15 వేలకు పైగా ఎక్కువగా వస్తుండటంతో రైతులు కోలుకుంటున్నారు. గత ఏడాది సాగు చేసి మంచి ధర కోసం గిడ్డంగులు నిల్వ ఉంచి వేచి ఉన్న రైతులకు బాగా కలిసి వచ్చింది. పంటను గుంటూరు, నంద్యాల, కర్నూలు మార్కెట్ యార్డులకు తరలించి విక్రయిస్తున్నారు.


### మంచి లాభాలు వచ్చాయి



గతేడాది నుంచి ధరలు పెరుగుతుండటంతో ఈసారి అత్యధిక ధర వస్తుందని ముందే ఊహించి రెండున్నర ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాను. అయితే వర్షాకాలం నల్లతామర తెగులు సోకింది. హార్టికల్చర్ అధికారుల సలహాలు, సూచనలు తీసుకున్నాను. ప్రస్తుతం ఎకరాకు 18 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దిగుబడి తగ్గినా ధర బాగా ఉండటంతో మంచి లాభాలు వచ్చాయి.

– ఫక్కీరెడ్డి, బండిఆత్మకూరు

### క్వింటం రూ. 28 వేల చొప్పున విక్రయించా



నేను ఈ ఏడాది ఎకరన్నరలో మిర్చి వేశాను. పంట పెరిగే దశలో మచ్చతెగులుతో పాటు నల్లతామర తెగులు వలన పూత బాగా రాలింది. మందులు పిచికారీ చేయడంతో పూత నిలబడింది. ప్రస్తుతం రెండు కోతలు పూర్తయ్యాయి. 15 క్వింటాళ్ల దిగుబడి రాగా క్వింటం రూ. 28 వేల చొప్పున విక్రయించా. మూడో విడత మరో 7 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

– వెంకటేశ్వర్లు, బాపనంతపురం